సాక్షి
హనుమకొండ
గురువారం | 9 | ఫిబ్రవరి | 2023



కేవీకే సేవలు ప్రశంసనీయం

మామునూరు కేవీకే ద్వారా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పీవీ నర్సింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం వీసీ రవీంద్రా రెడ్డి అన్నారు. - 8లో▸



మహా శివరాత్రికి బస్సులు

మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$34.0^0/15.0^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘాలతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు లోకల్ కోర్టు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యలు స్థానికంగా తెలుసుకుని పరిష్కరించేందుకు లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ పి.సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం కాజీపేట సోమిడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉదయం 10.30 గంటలకు లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కడిపికొండ, కాజీపేట, మడికొండ, ఎన్ఐటీ, వడ్డెపల్లి సెక్షన్ కార్యాలయాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదులు అందించి పరిష్కరించుకోవాలని సూచించారు.

నేటినుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, ఒకేషనల్, బీసీఏ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు గురువారంనుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 49, ఖమ్మంలో 34, ఆదిలాబాద్ జిల్లాలో 50 చొప్పున మొత్తంగా 113 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొత్తంగా 75,869మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందులో 40,667మంది పురుషులు, 35,202మంది మహిళలు ఉన్నారు. ప్రతి పరీక్షకేంద్రంలో ఒక చీఫ్ సూపరింటెండెంట్, అబ్జర్వర్‌తోపాటు 2,663మంది సిబ్బందిని నియమించారు. ఈ నెల 9, 10,13, 14,15, 16, 17, 20, 21, 22వ తేదీ వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతి జిల్లాలో స్క్వాడ్ బృందాలను ఏర్పాటుచేశారు. కాకతీయ యూనివర్సిటీనుంచి కూడా ప్రత్యేకంగా స్క్వాడ్ బృందం ఉంటుంది.

నిట్‌లో వైరల్ ఫీవర్

కాజీపేట అర్బన్: కాజీపేటలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో వైరల్ ఫీవర్.. వైరల్‌గా మారింది. పదిహేను రోజులనుంచి అధ్యాపకులు, విద్యార్థులు ఒకరి తరువాత మరొకరు జ్వరాలబారిన పడుతున్నారు. వారం రోజులపాటు గొంతునొప్పి, ముక్కు దిబ్బడంతోపాటు జ్వరంతో బాధపడుతున్నారు. గతంలో కరోనా బారిన పడిన వారికి కనిపించిన లక్షణాలు వైరల్ ఫీవర్‌లో ఉండడంతో కొంత భయాందోళనకు గురవుతున్నారు.

జూనియర్ సివిల్ జడ్జి పోస్టులు భర్తీ చేయాలి



వరంగల్ లీగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఖాళీ ఉన్న జూనియర్ సివిల్ జడ్జి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, వేర్వేరుగా కుటుంబ కోర్టులు ఏర్పాటు చేయాలని జిల్లా పరిపాలనా న్యాయమూర్తి అభిషేక్‌రెడ్డిని బార్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం అభిషేక్‌రెడ్డితోపాటు రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందించారు. అనంతరం పలు సమస్యలపై వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. రెండు జిల్లాల న్యాయవాదుల సంఘాన్ని వేర్వేరుగా ఏర్పాటు చేయాలని తీర్మానం కాపీని బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డికి అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.ఆనంద్‌మోహన్, జి.శ్రీనివాస్‌గౌడ్, బార్ కౌన్సిల్ మెంబర్ సంజీవరావు, కమిటీ మెంబర్స్ రామకృష్ణారెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.

బఫర్ జోన్‌లో ఆరోగ్యకేంద్రం

హసన్‌పర్తి: నగరంలోని 55వ డివిజన్‌కు మంజూరైన ఆరోగ్య ఉపకేంద్రం చెరువుశిఖం బఫర్ జోన్‌లో నిర్మిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు నీటిపారుదలశాఖ అధికారులు స్పందించారు. బుధవారం సంఘటన స్థలాన్ని సందర్శించి పనులు నిలిపివేయాలని ఆదేశించారు. టీఎండీఐ కార్పొరేషన్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సబ్‌సెంటర్‌ల నిర్మాణాలు చేపడుతోంది. ఇందులో భాగంగా 55వ డివిజన్‌కు మంజూరైన ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి స్థానిక చెరువు పక్కస్థలాన్ని గుర్తించి శంకుస్థాపన చేశారు. అది బఫర్‌జోన్ పరిధిలోకి వస్తుందని తేలడంతో పనులు నిలిపివేయాలని ఏఈ శ్రీనివాస్ ఆదేశించారు. ఈ విషయమై కలెక్టర్, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆయన చెప్పారు.

ఘనంగా తిరుగువారం
ఉప్మా, అన్నంలో పురుగులు
తూకంలో మోసం
కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు - 10లో▸

లేఅవుట్‌లో.. నాన్ లేఅవుట్!

పార్కు స్థలాలను ప్లాట్లు చేసి అమ్మిన 'రియల్' వ్యాపారులు

- 1993లో లేఅవుట్ వెంచర్.. 2004లో ప్లాట్లుగా పార్క్ స్థలం
- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు
- రూ.కోట్లు ఆర్జించిన 'రియల్' వ్యాపారులు
- 'మామూలు'గా తీసుకుంటున్న 'కుడా' అధికారులు
- గ్రేటర్ వరంగల్‌లో చర్చనీయాంశం
- ఉన్నతాధికారులకు చేరిన ఫిర్యాదులు

భవిష్యత్ అవసరాల కోసం కేటాయించిన స్థలాలు కూడా కబ్జాదారుల పరమయ్యాయి. లేఅవుట్‌లోని పార్కు స్థలాల (గ్రీన్‌ల్యాండ్స్)ను ప్లాట్లుగా చేసి అమ్మేసిన రియల్ వ్యాపారులు.. ఆ స్థలాలు ఎక్కడున్నాయో గుర్తించకుండా ఉండేందుకు 'కుడా' ఆమోదిత లేఔట్ ప్రతులనే కనిపించకుండా చేశారు. భీమారం ప్రాంతంలో జరిగిన భూబాగోతంలో వ్యాపారులు రూ.కోట్లు దండుకున్నారు.



ప్లాట్లుగా మారిన పార్కు స్థలం..



1993లో చేసిన వెంచర్ మ్యాప్



సాక్షిప్రతినిధి, వరంగల్: గ్రేటర్ వరంగల్ పరిధి భీమారం శివారులో బస్వారెడ్డి టౌన్‌షిప్‌లో నాన్‌లేఅవుట్ ప్లాట్లు ప్రత్యక్షమయ్యాయి. 1993లో కుడా అనుమతితో ఈ వెంచర్ ఏర్పడింది. భీమారం శివారులోని సర్వే నంబర్ 107, 108, 111, 112, 113,118, 119,129, 131, 132, 135లో 52 సుమారు ఎకరాల మేర భూములు కొనుగోలు చేశారు. వెంచర్ అనుమతి కోసం కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)కి దరఖాస్తు చేశారు. బస్వారెడ్డి టౌన్‌షిప్ పేరిట సదరు నిర్వాహకుడు వెంచర్ కోసం 1993లో చేసిన దరఖాస్తుపై డీపీ నెంబర్ 5/93 ప్రొసీడింగ్ జారీ చేసింది. ఈ మేరకు 52 ఎకరాల్లో 486 ప్లాట్లు, ఆరు పార్క్‌లతో రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేసి విక్రయాలు జరిపారు.

ఇదీ జరిగింది...

1993లో బస్వారెడ్డి టౌన్‌షిప్‌కు కుడా డీపీ నంబర్ కేటాయించగా, 11 సర్వేనంబర్లలోని 52 ఎకరాల్లో చేసిన 486 ప్లాట్లను వ్యాపారులు విక్రయించారు. గ్రీనరీ, పార్కింగ్ వంటి భవిష్యత్ అవసరాలకు 5.20 ఎకరాలు వదిలినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పార్కులు, పార్కింగ్ స్థలాల కోసం వదిలేసిన స్థలాలు భవిష్యత్ అవసరాకు వినియోగించాల్సిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు పదేళ్ల తర్వాత ఆ స్థలాలపైనా కన్నేశారు. ఆరు పార్కులను నాలుగు పార్కులకు తగ్గించి ఆ రెండు పార్కుల్లో సైతం 35 ప్లాట్లు చేశారు. ఆ ప్లాట్లకు ఎలాంటి అనుమతి లేకుండానే విక్రయాలు జరిపారు. ఈ వ్యవహారంపై కమిషనర్, కలెక్టర్‌లకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి కుడా కమిషనర్ శాలిని మిశ్రా వెంచర్‌ను పరిశీలించారు.. ముందు పేర్కొన్న విధంగా ప్లాట్ల సంఖ్య పెరగడంతో పాటు ఎస్సారెస్పీ కాల్వకట్టను రోడ్డుగా చూపించినట్లు ఆమె గుర్తించారు. సదరు వెంచర్ నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశారు. అలాగే డీపీ నంబర్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.కోట్లు కొట్టేసిన వ్యాపారులు.. రోడ్డునపడ్డ బాధితులు...

కమిషనర్ బదిలీ కాగానే లేఅవుట్ గ్రీన్‌ల్యాండ్‌లో నాన్ లేఅవుట్ చేసిన ప్లాట్లను సదరు వెంచర్ నిర్వాహకులు విక్రయించారు. బస్వారెడ్డి టౌన్‌షిప్ కాలనీవాసులకు చెందాల్సిన రూ.20 కోట్ల విలువ చేసే గ్రీన్‌ల్యాండ్‌లో 2003-04లో చేసిన ప్లాట్లను కొంత మంది బాధితులకు కట్టబెట్టారు. సదరు వ్యక్తులు ఇంటి నిర్మాణాల కోసం ఒక్కొక్కరుగా అనుమతులు తీసుకున్నారు. నిర్మాణాలు చేసుకుంటుండగా ఇన్నాళ్లకు మేల్కొన్న కుడా అధికారులు ఇటీవల పార్కు స్థలాల్లో నిర్మిస్తున్నారంటూ నిర్మాణంలో ఉన్న ఓ ఇల్లు కూల్చివేసి.. మిగతా వాళ్లకు కూల్చివేతలకు నోటీసులు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసి, ఇళ్ల నిర్మాణం చేపడితే... అనుమతులు ఇచ్చి నోటీసులు ఇవ్వడంపై బాధితులు కలెక్టర్, కుడా వైస్ చైర్మన్‌లను ఆశ్రయించారు. బస్వారెడ్డి టౌన్‌షిప్ నిర్వాహకులపై ఫిర్యాదు చేశారు. ఈ విషయం నగరంలో తాజాగా చర్చనీయాంశమైంది.

పక్కదారి పట్టించి అనుమతులు తీసుకున్నారు

బస్వారెడ్డి టౌన్‌షిప్‌లో బల్దియా అధికారులను పక్కదారి పట్టించి పార్కు స్థలంలో అనుమతులు తీసుకున్నారు. అక్కడ వేసిన ప్లాట్లకు 'కుడా' నుంచి అనుమతి లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్మాణాలు కూల్చివేశాం. కొందరికీ నోటీసులు కూడా ఇచ్చాం.

\- వెంకన్న, టీపీఓ, 'కుడా'



మహబూబాబాద్ పట్టణ పరిధిలోని ఈదుల పూసపల్లి వద్ద పాదయాత్రలో రేవంత్ రెడ్డి, బలరాం నాయక్, ములుగు ఎమ్మెల్యే సీతక్క తదితరులు

విన్నపాలు వింటూ.. హామీలిస్తూ..

మానుకోట జిల్లాలో సాగిన రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర

- జనంతో మమేకమై.. సమస్యలు తెలుసుకుంటూ..
- ఉపాధ్యాయులు, ఉద్యోగుల విన్నపాల స్వీకరణ
- ఈదులపూసపల్లిలో కాంగ్రెస్ నాయకులతో సమావేశం
- వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే.. కష్టపడి పనిచేయాలని పిలుపు



రేవంత్‌రెడ్డికి బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న మహిళా కార్యకర్త

సాక్షి, మహబూబాబాద్/ కేసముద్రం/ మహబూబాబాద్ రూరల్: దారి పొడవునా కాంగ్రెస్ కార్యకర్తలు వెంటరాగా.. అడుగడుగునా రైతులు, కూలీలు, ప్రయాణికులు, ఆటోడ్రైవర్లు, ఆర్టీసీ ఉద్యోగులను పలకరిస్తూ.. వారి సమస్యలు తెలుసుకుంటూ.. విన్నపాలు స్వీకరిస్తూ.. హామీలతో భరోసా కల్పిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర బుధవారం మహబూబాబాద్ జిల్లాలో సాగింది. కేసముద్రం మండలం పెనుగొండలో బస ప్రాంతం నుంచి ఉదయం 10:30గంటలకు ఆయన పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్ర మధ్యలో మిర్చి రైతులు, కూలీలను ఆత్మీయంగా పలకరించారు. మిర్చి పంట వేస్తే నష్టం వస్తుందని, పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నామని రైతులు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులకు మంచి రోజులు వస్తాయని రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పక్కనే ఉన్న కుమ్మరి సారెను తిప్పారు. గొల్ల, కురుమలు వచ్చి గొర్రెపిల్లను అందజేయగా.. పార్టీ కార్యకర్తలు నాగలి బహూకరించారు. అనంతరం మహబూబాబాద్ మండలం ఉత్తరతండా గ్రామం పరిధిలోని నేతాజీతండా వద్ద ఆగి అరుగుపై కూర్చున్నారు. అక్కడ కార్యకర్త తెచ్చి ఇచ్చిన చాయ్ తాగుతూ తండావాసులతో మాట కలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఈదులపూసపల్లి గ్రామంలోని లంచ్ పాయింట్‌కు చేరుకుని భోజనం చేశారు. సాయంత్రం 4-30గంటలకు అక్కడినుంచి పాదయాత్ర మహబూబాబాద్ పట్టణం వైపు సాగింది. ఈ క్రమంలో ఆయనకు పూలతో స్వాగతం పలికారు. నాగార్జునకాలనీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతంలో కార్యకర్తలు, అభిమానులు ఎదురురాగా వారికి అభివాదం చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, నెహ్రూ సెంటర్ మీదుగా కోర్టు సెంటర్‌కు చేరుకుని కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగుల విన్నపం..

జిల్లా కేంద్రానికి చేరుకున్న రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు కలిసి మాట్లాడారు. తమకు సీపీఎస్ విధానంతో ఇబ్బందులు ఉన్నాయని, దీనిని తొలగించాలని కోరారు. అదేవిధంగా 317జీఓ ద్వారా ఉద్యోగులకు కొత్త సమస్య వచ్చిందని వాపోయారు. మన ప్రభుత్వం రాగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మంచి రోజులు వస్తాయని రేవంత్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యాసంస్థల్లో సమస్యలు ఉన్నాయని, గిరిజన బిడ్డలకు మెరుగైన భోజనం, విద్య అందించాలని, ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ కోరాడు. ఆదివాసీ, గిరిజన సమస్యలపై నాయకులు హరినాయక్, వట్టం ఉపేందర్, ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎంఎస్‌పీ నాయకుడు పీరయ్య కోరాడు. ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఉద్యోగులు, కార్మికులు వినతిపత్రం అందజేశారు. వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి రామచంద్రు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సేవాలాల్ జయంతికి అధికారికంగా సెలవు ప్రకటించాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వెంకన్ననాయక్, నందూలాల్ కోరారు.

పార్టీ బూత్ కో-ఆర్డినేటర్లతో సమావేశం

ఈదులపూసపల్లిలో మధ్యాహ్న భోజన విరామం అనంతరం రేవంత్‌రెడ్డి పార్టీ బూత్ కోఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానుకోట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. ఇన్నాళ్లు కష్టాలు ఎదుర్కొన్న మీరు మరో తొమ్మిది నెలలు సైనికుల్లా పనిచేయాలని, తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది మన పార్టీనే అని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, రాష్ట్ర నాయకుడు మల్లు రవి, ఎమ్మెల్యే సీతక్క, నాయకులు బలరాంనాయక్, వేం నరేందర్‌రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, బెల్లయ్య నాయక్, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మురళీనాయక్, అంజయ్య, నూనావత్ రాధ, దశరథ రెడ్డి, దస్రూనాయక్, నెహ్రూనాయక్, జిన్నారెడ్డి పద్మజా వెంకటేశ్వర్లు, అయ్యప్పరెడ్డి, ఉదయ్ చందర్, ఖలీల్, గుట్టయ్య తదితరులు ఉన్నారు.

11న లోక్ అదాలత్

- రాజీపడే కేసుల పరిష్కారానికి చక్కని అవకాశం
- వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి



మాట్లాడుతున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి, చిత్రంలో హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కృష్ణమూర్తి తదితరులు

వరంగల్ లీగల్: రాజీమార్గం.. రాజమార్గమని వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ నెల 11న (శనివారం) రెండు జిల్లాల్లో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో రాజీపడే క్రిమినల్, సివిల్, భూతగాదాల, మోటార్ వెహికల్ యాక్సిడెంట్, వివాహ, కుటుంబ తగాదా, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్‌ఫండ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, కన్జూమర్ ఫోరం, ట్రాఫిక్ ఈ చలాన్, ప్రీ లిటిగేషన్, తదితర రాజీ కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కక్షిదారులు తమ తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టుల్లో తెలియజేసి రాజీకుదుర్చుకోవాలని కోరారు. దీంతో కోర్టుల చుట్టూ తిరిగే బాధ లేకుండా ప్రశాంతమైన జీవనం కొనసాగించవచ్చన్నారు. రాజీపడే కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరు కావాలని సూచించారు. ఇప్పటికే పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్, ఎక్సైజ్, ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులు, బ్యాంకు, చిట్‌ఫండ్ మేనేజర్లతో సమావేశాలు నిర్వహించి అధిక కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌పై ఎటువంటి సలహాలు, సందేహాలకైనా, న్యాయ సహాయం కోసమైన జిల్లా న్యాయసేవాధికార సంస్థలను ఆశ్రయించి, ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందాలని సూచించారు.

వరంగల్‌లో 07, హనుమకొండలో 07 బెంచ్‌ల ఏర్పాటు..

లోక్ అదాలత్ కోసం వరంగల్ జిల్లాలో (వరంగల్ -5, నర్సంపేట - 2) 07 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి తెలిపారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా లోక్ అదాలత్‌లో గుర్తించిన మొత్తం 1,155 పెండింగ్ కేసుల్లోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సూచించినట్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలో (హనుమకొండ -6, పరకాల -1) 07 బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి చెప్పారు. ఇప్పటికే 425 పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు కక్షిదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ధర్మసాగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, నారాయణగిరిలో ఏర్పాటుచేసిన కంటివెలుగు కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. కంటి పరీక్షలను పరిశీలించారు. కంటి వెలుగుపై ప్రజల స్పందన ఎలా ఉంది, రోజుకు ఎంతమంది పరీక్షలు చేయించుకునేందుకు వస్తున్నారు.. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ పరీక్షలు చేసుకోవాలని, దృష్టి లోపం ఉన్నవారికి కళ్లద్దాలు కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేయించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న నర్సరీ పనులను పరిశీలించారు. అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మ కవిత, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకుబ్ పాషా, కంటి వెలుగు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, వైద్యాధికారులు రవీందర్‌రెడ్డి, నెహ్రూ చంద్ నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎర్రబెల్లి శరత్, కర్ర సోమిరెడ్డి, మండల వైద్యాధికారి గోపినాథ్, కార్యదర్శి నాగపురి మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

హన్మకొండ అర్బన్: మహాశివరాత్రి ఉత్సవాలకు నగరంలోని ఆలయాల వద్ద భక్తుల కోసం ఘనంగా ఏర్పాట్లు చేయనున్నట్లు హనుమకొండ ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్‌ఓ వాసుచంద్ర తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ కిరణ్‌కుమార్, వివిధ శాఖ అధికారులతో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. వాసుచంద్ర మాట్లాడుతూ ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా వేయి స్తంభాల దేవాలయంలో శ్రీ రుద్రేశ్వరస్వామికి 17 నుంచి 21వ తేదీ వరకు, మెట్టుగుట్టలోని శ్రీ స్వయంభూ మెట్టు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో 16 నుంచి 24వ తేదీ వరకు ఘనంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సునీత, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లు నాయక్, ఈఓ శేషగిరి, మెట్టుగుట్ట ఈఓ శేషుభారతి, డీఎస్‌ఓ డాక్టర్ వాణిశ్రీ, ఆర్అండ్‌బీ ఈఈ రాజం, జిల్లా ఫైర్ ఆఫీసర్ భార్గవ్‌రెడ్డి, జిల్లా ఫిషరీస్ ఆఫీసర్ విజయభారతి, ఎన్పీడీసీఎల్ ఈడీ సాంబరెడ్డి, జీడబ్ల్యూఎంసీ ఈఈ శ్రీనివాసరావు, హనుమకొండ తహసీల్దార్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేయిస్తంభాల ఆలయ ఉత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆవిష్కరించారు.



సమీక్షలో మాట్లాడుతున్న వాసుచంద్ర, హాజరైన అధికారులు

రబ్బానీ దర్గా ఉర్సుకు తగిన ఏర్పాట్లు

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని హజ్రత్ మాషూఖ్ రబ్బానీ దర్గా ఉర్సును ఘనంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం దర్గాను డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, పీఠాధిపతి ఉబేద్‌బాబాలతో కలిసి సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. దర్గా పరిసర ప్రాంతాల చదును, తాగునీటి వసతికి ఆటంకం లేకుండా చూడాలన్నారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్ల రవి, సయ్యద్ మసూద్, ఖాదర్‌వలీబాబా మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


వార్షిక బడ్జెట్ ప్రణాళికకు కసరత్తు

సన్నాహక సమావేశంలో మేయర్, కమిషనర్

వరంగల్ అర్బన్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రేటర్ వరంగల్ బడ్జెట్ రూపకల్పనపై కసరత్తులు ప్రారంభమయ్యాయి. బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ ప్రావీణ్యలు బుధవారం సాయంత్రం విభాగాల వారీగా సమీక్షించారు. 2022-23 వార్షిక బడ్జెట్‌పై అంచనాలు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూపొందించనున్న పద్దులపై చర్చించారు. గత బడ్జెట్‌నే యథాతథంగా కాకుండా వాస్తవాలకు దగ్గరగా, ఆమోదయోగ్యంగా రూపొందించాలని మేయర్ సూచించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యం, అర్బన్ మలేరియా, ఉద్యాన వన, ఎలక్ట్రికల్, పన్నుల విభాగం తదితర విభాగాల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆదాయాలు, వ్యయాలను కచ్చితత్వంతో కూడిన పద్దులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

వేతన జీవుల వెతలు

- వారందాటినా అందని వేతనాలు
- బ్యాంక్ బ్యాలెన్స్ జీరో..
- రుణాల విషయంలో డిఫాల్టర్స్‌గా మారుతున్న ఉద్యోగులు
- ప్రభుత్వ తీరుపై మండిపాటు



8వ తేదీ వచ్చినా వేతనం రాక జీరోబ్యాలెన్స్ చూపుతోందని ఆవేదనతో ఓ ప్రభుత్వ ఉద్యోగి తీసిన తన బ్యాంక్ ఖాతా స్క్రీన్ షాట్

హన్మకొండ అర్బన్: ఫిబ్రవరి నెల మొదలై వారం దాటింది. సగటు ప్రభుత్వ ఉద్యోగికి అందాల్సిన వేతనం ఇప్పటివరకు అందలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు మొబైల్ ఫోన్‌లో బ్యాలెన్స్ చెక్ చేసుకుంటే జీరో బ్యాలెన్స్‌గానే దర్శనమివ్వడంతో ఉసూరుమంటున్నారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 40వేల మంది వరకు ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర ఉద్యోగులు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు.

అందరికీ వాయిదాలే...

ఉద్యోగులకు ఒకటో తారీఖున వేతనం వస్తేనే ఇంటి అద్దె, పాలబిల్లు, కిరాణం సామాన్లు, కరంట్ బిల్లు చెల్లించుకునేది. ప్రస్తుతం వీరందరికీ నిత్యం సమాధానం చెప్పలేక పోతున్నామని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఇక నెలసరి మందులు కొనుగోలు చేసేవారు, వైద్యపరీక్షలు చేయిచుకునే వారి పరిస్థితి దారుణం. షుగర్, బీపీ ఉన్నవారు జీరో బ్యాలెన్స్ ఖాతాలతో టెన్షన్‌కు గురై రోగాలు పెరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

రుణాలకు డిఫాల్టర్స్‌గా...

ప్రభుత్వ ఉద్యోగులకు తప్పనిసరిగా వ్యక్తిగత రుణాలు, హౌసింగ్, వాహన రుణాలు పొంది ఉంటారు. వాటికి నెలవారీ చెల్లించాల్సిన కిస్తీల సమయం మొదటివారంలో ఉంటుంది. వారం దాటిని జీతం డబ్బులు ఖాతాలో చేరకపోవడంతో జీరోబ్యాలెన్స్ ఖాతాలుగా మారిపోతున్నాయి. దీనికితోడు బ్యాంకుల వారు రుణం ఇవ్వడానికి అర్హతగా పరిగణించే సిబిల్ పడిపోతోంది. దీంతో రుణాలు పొందడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మీ జిల్లాలో జీతాలు పడ్డాయా..

నిధులు లేని కారణంగా గతంలో ఆల్ఫాబిటికల్ ఆర్డర్‌లో జిల్లాలకు వేతనాలు జమచేసేవారు. వరంగల్ జిల్లాకు ఆఖరున వచ్చేవి. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్ తదితర జిల్లాల్లో మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఏ రెండు జిల్లాల ఉద్యోగులు కలిసినా 'మీ జిల్లాలో జీతాలు పడ్డాయా' అంటూ ఆరా తీస్తుండడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం వెంటనే ఖాతాల్లో డబ్బులు జమచేయాలని కోరుతున్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి

గీసుకొండ: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వైద్యులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.పద్మశ్రీ అన్నారు. బుధవారం కొనాయమాకుల, శాయంపేట, గొర్రెకుంట గ్రామాల్లో నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు పరీక్ష శిబిరాలను ఆమె సందర్శించారు.



ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు కంటి పరీక్షలపై విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ మాధవీలత, సీహెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభకు పదును


శంభునిపేట, వరంగల్ బాలికలు-1 గురుకులం


హనుమకొండ గురుకులంలో డార్మెటరీ పరిశీలిస్తున్న అధికారులు

- మైనార్టీ గురుకులాల్లో 'కార్పొరేట్' వసతులు
- పోటీ పరీక్షలకు శిక్షణ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 గురుకుల పాఠశాలలు, కళాశాలలు
- ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు 15వరకు గడువు

న్యూశాయంపేట: పేద విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభకు పదను పెడుతూ కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలను అందిస్తూ మైనార్టీ గురుకులాలు ముందుకు సాగుతున్నాయి. నాణ్యమైన భోజనం, ఇంగ్లిష్ మీడియం విద్యాబోధనను అందిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 16 గురుకుల పాఠశాలలు, కళాశాలలు మైనార్టీలకు విద్యాబోధనను అందచేస్తున్నాయి. ఇందులో 8 గురుకులాలు బాలికలు, 8 బాలుర కోసం కేటాయించారు. ప్రత్యేకంగా మైనార్టీ పిల్లల కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా ఉర్దూ సబ్జెక్ట్‌తో పాటు నైతిక విలువలతో కూడిన అరబిక్ విద్యను అందిస్తున్నారు. ప్రతి గురుకుల విద్యార్థికి పుస్తకాలు, బ్యాగులు, నోట్‌పుస్తకాలు ఉచితంగా అందచేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం స్టాఫ్ నర్సులు పనిచేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం

విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం, బూస్ట్, మధ్యాహ్నం గుడ్డుతో భోజనం, సాయంత్రం స్నాక్స్, ప్రతి ఆదివారం చికెన్‌తో భోజనాన్ని అందచేస్తున్నారు. మినరల్ వాటర్, చలికాలంలో స్నానాలకు గ్రీజర్స్‌ల ద్వారా వేడి నీటి సౌకర్యం కల్పించారు.

పోటీ పరీక్షల్లో శిక్షణ

విద్యార్థులకు నీట్, ఐఐటీ, ఎంసెట్, పాలిటెక్నిక్ తదితర పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. ఎన్‌సీసీతోపాటు, వివిధ క్రీడాంశాల్లో ప్రత్యేక శిక్షణను అందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటేందుకు వీలుగా టెమ్రిస్ అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రతి గురుకులంలో సుశిక్షితులైన పీఈటీలతో క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

రెండు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలు

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థుల కోసం గ్రేటర్ వరంగల్ నగరంలో రెండు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సి (సీఓఈ) కళాశాలలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటి వరకు ప్రతిభ గల విద్యార్థులు హైదరాబాద్‌లో నీట్, ఐఐటీ, ఎంసెట్ తదితర పోటీ పరీక్షల్లో శిక్షణ పొందేవారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి శిక్షణ ఇచ్చేందుకు బాలుర కోసం వరంగల్ జక్కల్దొద్ది బాలుర-1, బాలికల కోసం హంటర్‌రోడ్‌లోని హనుమకొండ బాలికల-1 గురుకులాలను ఎంపిక చేశారు.

ఉమ్మడి జిల్లాలో గురుకులాలు..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 16 గురుకుల పాఠశాలలు, కళాశాలలు పనిచేస్తున్నాయి. బాలుర కోసం వరంగల్ బాలురు -1, వర్ధన్నపేట బాలురు, హనుమకొండ బాలురు -1, (ఒకేషనల్ జూనియర్ కళాశాల) కాజీపేట బాలురు, పరకాల బాలురు, జనగామ బాలురు, మహబూబాబాద్ బాలురు, భూపాలపల్లి బాలురు, బాలికల కోసం.. వరంగల్ బాలికలు-1, వరంగల్ బాలికలు-2,నర్సంపేట బాలికలు-1, హనుమకొండ బాలికలు-1, తొర్రూర్ బాలికలు-1, ములుగు బాలికలు-1, స్టేషన్‌ఘన్‌పూర్ బాలికలు, డోర్నకల్ బాలికలు-1(ఒకేషనల్ జూనియర్ కళాశాల) వీటిలో ఐదో తరగతి నుంచి ఇంటర్ విద్యను అందిస్తున్నాయి. వీటిలో మైనారిటీలకు 75శాతం, మైనార్టీ ఏతరులకు 25 శాతం సీట్లు కేటాయిస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

గురుకులాల్లో దరఖాస్తు కోసం ఈనెల 15 వరకు గుడువు విధించారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా (డబ్ల్యూడబ్ల్యూ.టీఎంఆర్‌ఐఈఎస్.తెలంగాణ.జీఓవీ.ఇన్)లో గాని నేరుగా ఆయా జిల్లాల పరిధిలో ఉన్న గురుకులాల్లో తమ దరఖాస్తులు సమర్పించవచ్చు. లేదా ఆయా జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయలాల్లో దరఖాస్తు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

విజన్‌తో పనిచేస్తున్నాం



టెమ్రిస్ సెక్రటరీ షఫియుల్లా ఇచ్చిన విజన్‌తో పనిచేస్తున్నాం. ఇంటర్ మొదటి సంవత్సరంలో రెండు స్టేట్ ర్యాంకులు సాధించాం. గురుకులంలో వంద శాతం హాజరు శాతం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– తాళ్ల నీలిమాదేవి, ప్రిన్సిపాల్, నర్సంపేట బాలికలు

నాణ్యమైన విద్య..



పేద మైనార్టీ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందిస్తున్నాం. మా విద్యార్థులు మొదటి బ్యాచ్‌లోనే స్టేట్ ర్యాంకులు సాధించారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విద్యతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నాం.

– పోతు అనిల్‌బాబు, ప్రిన్సిపాల్, జనగామ బాలుర కళాశాల

పోస్టల్ ఖాతా తీసుకోండి

హన్మకొండ: గ్రామాల్లోని పోస్టాఫీస్‌ల్లో ఆధార్ అనుసంధానంతో ఖాతాలు తీసుకోవడం ద్వారా రైతులు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి సొమ్ము సులువుగా పొందవచ్చని తపాలా శాఖ హనుమకొండ డివిజన్ సూపరింటెండెంట్ బానోతు నందా తెలిపారు. హనుమకొండ జిల్లాలో 4,600 మంది రైతులు, జనగామల 4,400 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 3,200, ములుగు జిల్లాలో 1,800 మంది రైతులు కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధిదారులున్నారని పేర్కొన్నారు. వీరికి పోస్టాఫీస్‌లో ఖాతాలు లేక ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి సొమ్ము పొందలేక పోతున్నారని తెలిపారు. రైతుల సౌకర్యార్థం ఈ నెల 15వ తేదీ వరకు ఖాతాలు ప్రారంభించడానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రైతులు తమ సమీపంలోని పోస్టాఫీస్‌లో ఆధార్ అనుసంధానంతో ఖాతాలు తెరుచుకోవాలని సూచించారు.

రైలుకింద పడి ఆత్మహత్య


కుమారస్వామి

కాశిబుగ్గ/నెల్లికుదురు:అనారోగ్య సమస్యలకు తాళలేక ఓ వ్యక్తి వరంగల్ రైల్వే స్టేషన్‌లో రైలుకింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామానికి చెందిన ముత్యాల కుమారస్వామి (36) కొంతకాలంగా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. సమస్య ఎక్కువ కావడంతో అతని తండ్రి, భార్యతో కలిసి హనుమకొండలోని ఆస్పత్రికి బుధవారం చికిత్స నిమిత్తం వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు వరంగల్ రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్‌ఫాం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో మానసికంగా కృంగిపోయిన కుమారస్వామి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. కుమారస్వామికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కేవీకే సేవలు ప్రశంసనీయం

- డాక్టర్ రవీంద్రారెడ్డి

కరీమాబాద్: రైతులకు మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ రవీంద్రారెడ్డి అన్నారు. కేవీకేలో బుధవారం నిర్వహించిన శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న 2022–23లో చేపట్టిన కార్యక్రమాలు, 2023–24లో చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేవీకే కార్యక్రమాలు రైతులకు ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. నూతనంగా వస్తున్న డ్రోన్ టెక్నాలజీ, అధిక సాంద్రతతో పంటలు పండించడం, పశువులలో పిండ మార్పిడి లాంటివి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కేవీకేలోని పెరటి కోళ్ల పెంపకం ప్రదర్శన క్షేత్రాన్ని ప్రారంభించడంతోపాటు గులాబీ పురుగు నివారణ, చేపల రవాణాలో తీసుకోవాల్సిన జాగ్రత్తల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మహేందర్, డాక్టర్ ఉమారెడ్డి, జేడీఏ ఉషాదయాళ్, నాబార్డు జీఎం చంద్రశేఖర్, డాక్టర్ బాలకృష్ణ, శ్రీనివాసరావు, వెంకట్‌నాయుడు, భారతి, లీడ్ బ్యాంకు మేనేజర్లు శ్రీనివాస్, రాజు, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం విడుదల చేస్తున్న డాక్టర్ రవీంద్రారెడ్డి, తదితరులు

సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: విద్యుత్ ఏఈలు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు ఆదేశించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయం నుంచి వరంగల్, మహబూబాబాద్ జిల్లాల ఎస్ఈలు, డీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా, డివిజన్, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో సీఎండీ గోపాల్ రావు మాట్లాడుతూ.. వినియోగదారులతో ఏఈలు మమేకమైన వారి సమస్యలు తీర్చాలని సూచించారు. రైతులు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఫెయిల్ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బకాయిలు, వసూళ్లలో వేగం పెంచాలని తెలిపారు. ప్రతి నెలా 15వ తేదీలోపు బిల్లింగ్ పూర్తి చేయాలన్నారు. దత్తత తీసుకున్న గ్రామాలను విద్యుత్ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఉద్యోగులు పని చేసే చోటే నివాసముండాలని ఆదేశించారు. కాలిపోయిన, పని చేయని మీటర్లను మార్చాలన్నారు. తాత్కాలికంగా నిలుపుదల సర్వీస్‌లను తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటేశ్వర్ రావు, గణపతి, సంధ్యారాణి, మోహన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సీజీఏలు సదర్‌లాల్, మోహన్‌రావు, జీఎం బీకం సింగ్, వరంగల్ ఎస్ఈ మధుసూదన్, మహబూబాబాద్ ఎస్ఈ నరేష్, డీఈ ఐటీ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ ఇంజనీర్లకు పదోన్నతి

టీఎస్ ఎన్పీడీసీఎల్‌లోని ఏడుగురు సబ్ ఇంజనీర్లకు అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పదోన్నతులు కల్పించి బదిలీ చేస్తూ సీఎండీ ఎ.గోపాల్ రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. యు.శివశంకర్‌ను శివునిపల్లి ఏఏఈగా నియమించారు. పి.శ్రీలతను వెంకటాపురం, ఎ.చంద్రశేఖర్‌ను చిట్యాల, ఎ.రవీందర్‌ను ఖిలాషాపూర్, ఎ.మంగమ్మను హసన్‌పర్తి, ఎం.సమీరను భూపాలపల్లి, బి.దేవీదాస్‌ను బాన్స్‌వాడ అడిషనల్ అసిస్టెంట్ ఇంజినీర్స్‌గా నియమించారు.

నేడు '108'లో ఉద్యోగాల ఎంపికలు

హన్మకొండ అర్బన్: 108 వాహనాలపై సేవలందించడానికి ఈఎంటీ (ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ టెక్నిషియన్), పైలట్ పోస్టులకు నేడు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని 108 జిల్లా కార్యాలయంలో అభ్యర్థుల ఎంపికలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈఎంటీ ఉద్యోగానికి సైన్స్ గ్రూప్‌లో డిగ్రీ (డిప్లొమా ఇన్ ఈఎంటీ, బీఎ స్సీ(పీసీబీ), బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బీ ఫార్మా, డీ ఫార్మాలతో పాటు ఇతర పారా మెడికల్ కోర్సు) చేసిన 30 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరి 13 నుంచి 60రోజులపాటు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. అలాగే పైలట్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని 30 ఏళ్ల ఉన్నవారు అ ర్హులని, ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు కలెక్టరేట్‌లోని 108 జిల్లా కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

'శంకరాభరణం' విశ్వనాథ్ చేసిన సాహసం

హన్మకొండ కల్చరల్ : శంకరాభరణం సినిమా తీయడం ఆ కాలంలో కళాతపస్వీ విశ్వనాథ్ చేసిన సాహసమని, కళాత్మక చిత్రాలను తెరకెక్కించిన ఆయన ప్రజల హృదయాలలో నిలిచిపోయిన గొప్ప దర్శకుడని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. బుధవారం సాయంత్రం వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో హంటర్ రోడ్‌లోని మాస్టర్‌జీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసి కళాతపస్వీ విశ్వనాథ్ సంస్మరణ సభ లో అంపశయ్య నవీన్ మాట్లాడారు. ముందుగా విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్ సిరాజుద్దీన్ మాట్లాడారు. మా సంస్థ 2016లో విశ్వనాథ్‌కు శాంతిదూత అవార్డు అందించి గౌరవించడం గర్వంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్, శ్రీపాద సుధాకర్ రావు, వీరేందర్, పీఆర్వో నిమ్మల శ్రీనివాస్, రాజమోహన్, మంజుల, రామిరెడ్డి, రాజకుమార్, విజయకుమార్, దేవునూరి ఆనంద్, అనితారెడ్డి, కొలిపాక ప్రకాష్ పాల్గొన్నారు.


విశ్వనాథ్‌కు నివాళులర్పిస్తున్న అంపశయ్య నవీన్, తదితరులు

11న 'మెపా' జాబ్‌మేళా

విద్యారణ్యపురి: విద్య, ఉపాధి, ఉద్యోగ, సాధికారిత కోసం ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా)ఆధ్వర్యంలో ఈనెల 11న మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు మెపా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తగట్టు శ్రీనివాస్, పులిదేవేందర్ బుధవారం తెలిపారు. హనుమకొండలోని మెపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఐఎంఏ హాల్‌లో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ప్రఖ్యాత కంపెనీలు పాల్గొంటున్న ఈజాబ్‌మేళాలో ఇంటర్, డిగ్రీ, ఆపై అర్హత కలిగి ఉండి 30 సంవత్సరాలలోపు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఐసీఐసీఐ, ఎస్‌బీఐ, ఫ్లిప్‌కార్ట్, మెడ్ ప్లస్, ఎస్‌బీఐ లైఫ్, ప్రీమియర్ హెల్త్‌కేర్, జీ4ఎస్, శుభగృహ తదితర కంపెనీలు ఈమేళాలలో పాల్గొని 500లకుపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ రాకేష్ 97010 11801 సంప్రదించాలని వారు సూచించారు.

మహా శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హన్మకొండ: మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు వరంగల్ రీజియన్‌లోని వివిధ ప్రాంతాలకు 123 ప్రత్యేక బస్సులు నడుపాలని ప్రణాళిక రూపొందించినట్లు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. హనుమకొండ నుంచి పాలకుర్తికి 15 బస్సులు, హనుమకొండ నుంచి కాళేశ్వరానికి 20, హనుమకొండ నుంచి రామప్పకు 10, హనుమకొండ నుంచి వేములవాడకు 25, హనుమకొండ నుంచి మడికొండ మెట్టుగుట్టకు 3, హనుమకొండ నుంచి కొమురవెల్లికి 35, హనుమకొండ నుంచి కురవికి 15 బస్సులు నడుపనున్నట్లు వివరించారు. 30 మంది ప్రయాణికులు ఒకే చోట ఉంటే వారి ఇంటి వద్దకు బస్సు పంపిస్తామని ఆర్ఎం శ్రీలత స్పష్టం చేశారు. వివరాలకు 99592 26056, 99592 26057 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆస్పత్రుల్లో సిజేరియన్లు తగ్గించాలి

- వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో కలెక్టర్ గోపి

గీసుకొండ: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు లేకుండా సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని వరంగల్ కలెక్టర్ బి.గోపి అన్నారు. బుధవారం తొలిసారిగా ఆయన డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని సందర్శించి.. ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు జరగకుండా పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధార్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ ప్రకాశ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పద్మశ్రీ, చల్లా మధుసూదన్, ఫిజియోథెరపిస్టు డాక్టర్ నర్సింహారెడ్డి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, రాజ్‌కుమార్, ఎస్ఓ విజయలక్ష్మి, ఎన్సీడీ కోఆర్డినేటర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కంటి వెలుగు అధికారులు ప్రతాపగిరి ప్రసాద్, డీడీఎం నితిన్‌రెడ్డి, రామలింగయ్య పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న కలెక్టర్ గోపి, పక్కన డీఎంహెచ్‌ఓ

ఉద్యోగమే లక్ష్యంగా చదవాలి

వరంగల్ రూరల్: నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదవాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి గుర్రాల జీవరత్నం అన్నారు. వరంగల్ సీకేఎం కాలేజీలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్–2, 3, 4 పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయా పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 90 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. రోజూ టిఫిన్, భోజనానికి రూ.75, అలాగే రూ.1,500 విలువైన స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ వెంకట్‌రెడ్డి, సూపరింటెండెంట్ రహీముద్దీన్, జూనియర్ అసిస్టెంట్ సుకన్య, అభ్యర్థులు పాల్గొన్నారు.

కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

కాశోజీ సెంటర్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు టీచింగ్ లర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం) కిట్లను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ వాసంతి అన్నారు. ఎన్ఐఈపీఐడీ, సికింద్రాబాద్ వారి సహకారంతో బుధవారం డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని 26 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు టీఎల్ఎం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఐఈ కోఆర్డినేటర్ కుడికాల సుభాష్, ఎన్ఐఈపీఐడీ కోఆర్డినేటర్ జె.సుధాకర్, హనుమకొండ జిల్లా ఐఈ కోఆర్డినేటర్ రాధ, ఐఈఆర్‌పీలు కపిల్‌రెడ్డి, శ్రీధరాచారి, స్వాతి, ప్రవీణ్, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కిట్లు పంపిణీ చేస్తున్న డీఈఓ వాసంతి

బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావడం కల

- డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: బీఆర్ఎస్, బీజేపీలు మళ్లీ అధికారంలోకి రావడం కలగానే మిగిలిపోతుందని, ఆ పార్టీలకు అధికారం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా లేరని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రను బుధవారం హనుమకొండ 10వ డివిజన్‌లోని పద్మాక్షి ఆలయ తోరణం వద్ద నాయిని కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. పలు కాలనీల్లో కలియదిరుగుతూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చార్జ్ షీట్, రాహుల్‌గాంధీ సందేశాన్ని కరపత్రాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్.కుమార్‌యాదవ్, నసీంజహాన్, బంక సరళ, భారతి, నజీర్, బాబ్జీ, సతీష్, రమేష్, రాకేష్, ఆరీఫ్, పర్వేజ్, జాఫర్, శ్రీను, అశోక్, మహేందర్, కృష్ణ, మొగిలి పాల్గొన్నారు.


నాయినికి సమస్య వివరిస్తున్న వృద్ధురాలు

'రైతుల సమస్యలు నివృత్తి చేయాలి'

కాశోజీ సెంటర్: సాగులో రైతుల సమస్యలను నివృత్తి చేసి.. వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడమే కార్యక్రమ ముఖ్యోద్దేశమని ఆర్ఏఆర్ఎస్, ఏడీఆర్ డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. వరంగల్‌లోని రైతు శిక్షణ కేంద్రంలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ 2022–23 సంవత్సర ఫస్ట్ బ్యాచ్‌లో 40 మంది ఇన్‌పుట్ డీలర్స్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిసోర్స్ పర్సన్లు చెప్పే విషయాలను శ్రద్ధగా విని బేసిక్ అగ్రికల్చర్‌లో ప్రావీణ్యం సంపాదించి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ మాట్లాడుతూ పంటల సాగుపై అవగాహన పెంచుకొని రైతులకు క్షేత్రస్థాయిలో సలహాలు సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో మామునూరు కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, ఏడీఏలు నగేష్, మాధవి, రిటైర్డ్ ఏడీఏ పి.సారంగం, మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

పేద దళితులకు భూమి ఇవ్వాలి

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలో దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ బుధవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. భూమిలేని వారి నుంచి మొదలుకొని అరకొర భూమి ఉన్న వారి వరకు సర్వే విధానంతో భూములను ఇవ్వాలని కోరారు. ఎస్సీ కుటుంబాల ప్రైవేటు భూములను, అసైన్డ్ భూములను ఆక్రమణదారులనుంచి పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీలకు కేటాయించిన అసైన్డ్ భూములను శ్మశాన వాటిక, డంపింగ్ యార్డ్, పట్టణ, పల్లె ప్రకృతి వనాల కోసం అనుమతి లేకుండా తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో గొర్రె మహేందర్, కిరణ్, మహేష్, యాకూబ్ పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పి.రామకృష్ణ